క్లుప్తంగా

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



హిస్టరీ షీట్‌లు కలిగిన వారికి అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో హిస్టరీ షీట్‌లు కలిగిన వ్యక్తులకు సంబంధిత పోలీసు అధికారులు శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ.. ప్రతీ శనివారం ఆయా పోలీస్ స్టేషన్ అధికారులు హిస్టరీ షీట్లు కలిగిన వారిని స్టేషన్‌కి పిలిపించి కౌన్సిలింగ్ చేయాలన్నారు. నేరప్రవృత్తిని విడనాడాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల గురించి పూర్తి, సమాచారం సంబంధిత అధికారులకు, సిబ్బందికి తెలియాలని, వారి జీవన విధానం, నేరప్రవృత్తిపై నిఘా పెట్టాలని ఎస్పీ ఆదేశించారు.

బాధ్యతల స్వీకరణ

నెల్లిమర్ల: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.రామకృష్ణరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. చీపురుపల్లి ఎంపీడీఓగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇదివరకు ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన జి.గిరిబాల బొండపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. విధుల్లో చేరిన రామకృష్ణరాజుకు ఎంపీపీ అంబల్ల సుధారాణి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

మినీగోకులాలపై స్పష్టత ఇవ్వండి



ఈసీ జోగారావును ప్రశ్నిస్తున్న సర్పంచ్ పాపునాయుడు

గంట్యాడ: పంచాయతీకి ఎన్ని మినీగోకులాల షెడ్లు మంజూరు చేస్తారో స్పష్టత ఇవ్వాల ని, అలా కాకుండా మినీగోకులాలు నిర్మించేసుకోండి అని రైతులకు చెప్పేసి వెళ్లిపోతే సరికాదని ఉపాధి హామీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్(ఈసీ) జోగారావును పెదవేమలి గ్రామ సర్పంచ్ పాపునాయుడు నిలదీశారు. పెదవేమలి గ్రామంలో ఉపాధి హామీ పనులపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి హామీ ఈసీ మాట్లాడుతూ పాడిరైతులు మినిగోకులాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికి సర్పంచ్ స్పందిస్తూ "మినీగోకులాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మీరు చెప్పేసి వెళ్లిపోతారు. ఆ తర్వాత మీరు ఒకటో, రెండో ఇస్తే మిగతా రైతులు మమ్మల్ని అడిగితే మేం ఏం సమాదానం చెప్పాలి. ఎన్ని గోకులాలు మంజూరు చేస్తారో, దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇస్తారో లేదో స్పష్టంగా చెప్పండి' అని కోరారు. ఈసీ స్పందిస్తూ ప్రస్తుతానికి మండలానికి 26 మినీగోకులాలు మాత్రమే మంజూరయ్యాయని చెప్పారు. సర్పంచ్ మాట్లాడుతూ మండలంలో 36 పంచాయతీలు ఉన్నాయని, 26 మంజూరు అయితే గ్రామానికి ఒకటి కూడా రాదు కదా అని ప్రశ్నించారు. దీంతో సమాధానం చెప్పలేక ఈసీ మిన్నకుండిపోయారు. గ్రామంలో ఎవరైనా మినీగోకులాలు ఏర్పాటు చేసుకోవాలనుకుంటే పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఎంపీటీసీ పాటుపు రెడ్డి భవాని, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరావు, ఫీల్డ్ అసిస్టెంట్ వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి



వల్లంపూడిలో వరిపంట వివరాలను సూపర్ చెక్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రామారావు

వేపాడ: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.టి.రామారావు సూచించారు. మండలంలోని వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట గ్రామాల్లో వరి, తదితర పంటలను పరిశీలించారు. పంటల వివరాలను సూపర్ చెక్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగులో పాటిస్తున్న పద్ధతులు, సేంద్రియ ఎరువులు, కషాయాలు, ద్రవ, ఘన జీవామృతాల వినియోగంపై ఆరా తీశారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా రైతులకు పెట్టుబడి సహాయం విడుదల చేసిన సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని దబ్బిరాజుపేట రైతుసేవాకేంద్రంలో రైతులతో కలిసి టీవీలో ప్రత్యక్ష ప్రసారం చూశారు. మండలంలో వరి పంట ఈ–క్రాప్ నమోదు శతశాతం, ఈకేవైసీ 93 శాతం పూర్తయ్యిందని ఏఓ యశ్వంతరావు చెప్పారు. ఏడీఏ ఎల్.విజయ, ఎంఏఓ సి.బి.యశ్వంతరావు పాల్గొన్నారు.

అన్నదాతకు ఏదీ భరోసా?

- అందని పెట్టుబడి సాయం, రాయితీలు
- విత్తనాలు, ఎరువులకూ తప్పని ఇబ్బందులు



పూసపాటిరేగలో వరిసాగు

నెల్లిమర్ల నియోజకవర్గంలో ప్రధాన పంటలు		
మండలం	పంటలు	విస్తీర్ణం(ఎకరాల్లో)
పూసపాటిరేగ	వరి, మొక్కజొన్న, వేరుశెనగ	3856
భోగాపురం	వరి, మొక్కజొన్న, అపరాలు	1250
డెంకాడ	వరి, మొక్కజొన్న, అపరాలు	3200
నెల్లిమర్ల	వరి, మొక్కజొన్న	3760

పూసపాటిరేగ: అన్నదాతలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే నాలుగు నెలలు పూర్తయినప్పటికి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందలేదు. కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. కలుపు నివారణ మందు, పంటను ఆశించే పురుగు మందులు పిచికారీ చేసేందుకు స్ప్రేయర్లు రాయితీపై మంజూరు చేయడం లేదు. ఏటా వ్యవసాయశాఖ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు రాయితీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్‌లు అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించడం లేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా రైతు భరోసా పథకం అమలు చేసింది. సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడికి ఇబ్బంది పడకుండా రైతు భరోసా మొత్తాన్ని బ్యాంకు ఖాతాలకు జమచేసింది. పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7500 కలిపి ఏడాదికి మూడు విడతలలో రూ.13,500 అందించేది. సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలు ప్రజలను ఊరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క పథకంపైనా స్పష్టత ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పులు చేసి ఖరీఫ్ పంటలు సాగు చేసినా నేటికి పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేస్తున్నా, కూటమి ప్రభుత్వం తనవంతు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అన్నదాతలను ఆదుకునే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు, టర్పాలిన్లు, ఆయల్ ఇంజిన్లు రాయితీపై సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులు వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నారు. రైతులకు పంటకాలంలో ఉపయోగపడే స్ప్రేయర్లు అయినా సరే కనీసం 50 శాతం రాయితీతో సరఫరా చేయాలి.

– కె.వెంకటరావు, రైతు పూసపాటిరేగ

రైతులను ఆదుకోవాలి

ఎన్నికలు సమయంలో కూటమి నాయకులు రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తామన్న హామీలను నెరవేర్చాలి. ఖరీఫ్ సీజన్‌కు అయినా పెట్టుబడి సాయం చేసి రైతులను ఆదుకోవాలి.

– పి.రామనర్సి, రైతు, హరిజన కాలనీ, పూసపాటిరేగ

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



వనంగుడి ఆవరణలో చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం , కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర మహోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్థానిక వనంగుడి ఆవరణలో శనివారం రాత్రి ప్రవల్లిక నృత్య కళానికేతన్‌కు చెందిన వై.కుమారి బృందం నిర్వహించిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. పిన్నింటి అప్పలనాయుడు, కోరాట తవిటినాయుడు ఏకపాత్రాభినయంతో అలరించారు. అదేవిధంగా చదురుగుడి ఆవరణలో కడగల సింహాచలం శ్రీశ్యామలాంబ కోలాట ప్రదర్శన, కేఏఎస్ మూర్తి భక్తి గీతాలాపన, ఆదిభట్ల సూర్యనారాయణ హరికథ రక్తికట్టించాయి. అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కళాకారులను ఘనంగా సత్కరించారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా



బొబ్బాదిపేటలో జేసీబీ సాయంతో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝులిపించారు. ఎటువంటి అనుమతులు లేకుండా కాలువలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించారు. కమిషనర్ నల్లనయ్య ఆదేశాల మేరకు శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీ యంత్రంతో నగరంలోని బొబ్బాదిపేట ప్రాంతంలో గుర్తించిన ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో ఆక్రమణదారులు అధికారులతో వాగ్వివాదానికి దిగడంతో కాసింత ఉద్రిక్తత నెలకొంది. అనంతరం నిబంధనల మేరకు ఆక్రమణలు తొలగిస్తున్నట్లు అధికారులు చెప్పి కాలువలపై నిర్మించిన కట్టడాలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో అనధికార నిర్మాణాలను, ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఏ ప్రాంతంలో కూడా అనధికార నిర్మాణాలు గానీ, కాలువలు, ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలకు పాల్పడటంతో ట్రాఫిక్ సమస్యతో పాటు పరిసరాల పరిశుభ్రతకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే నిర్మాణాలను తొలగించటంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మున్సిపల్ షాపుల పరిశీలన

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలోని మున్సిపాలిటీకి చెందిన షాపులను కమిషనర్ కిల్లాన అప్పలరాజు సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. షాపులు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి, ఎన్ని నెలల అద్దె బకాయి ఉందని ఆరాతీశారు. అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని లీజుదారులకు సూచించారు. లేదంటే ఖాళీ చేయిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ మేనేజర్ ఎంవీ రమణ, ఆర్ఐ పాపయ్యరాజు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ శనివారం తెలిపారు. బీఏ పొలిటికల్ సైన్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బోటనీ, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ గ్రూపుల్లో మిగుల సీట్లను భర్తీ చేయనున్నామని చెప్పారు. ఆసక్తి గల విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 99123 62922, 98663 39655 ఫోన్ నంబర్లను సంప్రదించా లని సూచించారు.

ఎన్‌సీసీ శిక్షణకు పయనం



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్ఎంసి చైర్మన్ సురేష్

చీపురుపల్లి: విద్యార్థులు జీవితంలో ఎదిగేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గవిడి సురేష్ చెప్పారు. 3(ఎ) నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో పది రోజుల పాటు నిర్వహించనున్న ఎన్‌సీసీ శిక్షణకు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థులు శనివారం పయనమ య్యారు. విద్యార్థులతో బయలుదేరిన బస్సును గవిడి సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఎన్‌సీసీ అధికారి మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశభక్తి, క్రమ శిక్షణ, పరిశుభ్రత అనే అంశాలతో పాటు భారత త్రివిధ దళాలపై విషయ పరిజ్ఞానం, గన్ ఫైర్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తారని చెప్పారు.

పైడితల్లి జాతరకు వేళాయె

విజయనగరం జిల్లా కేంద్రంలో ఈ నెల 14, 15న జరగనున్న శ్రీపైడితల్లి అమ్మవారి జాతరకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరాన్ని సుందరంగా మార్చేపనుల్లో అధికారులు తలమునకయ్యారు. వాటి దృశ్యాలు.



పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి చదురుగుడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



క్యూలో నిలబడే భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శాల



మెయిన్ రోడ్డులో దర్శనాలకు నిలబడే భక్తుల కోసం వేసిన శాల



ఆర్టీసీ కాంప్లెక్స్ ట్యాంక్‌బండ్ రోడ్డులో అఖిలభారత డ్వాక్రా బజార్‌కు ఏర్పాట్లు



డివైడర్లకు వేస్తున్న రంగులు



భక్తుల సౌకర్యార్థం ఆలయం పక్కనున్న కాలువను పూర్తి చేసిన దృశ్యం





చదురుగుడి ఆలయ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

చిన్న శ్రీనుకు అభినందనలు



చిన్న శ్రీనుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన మజ్జి శ్రీనివాసరావుకు నెల్లిమర్ల నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అభినందనలు తెలియజేశారు. విజయనగరంలోని ఆయన స్వగృహంలో శనివారం ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీలో పార్టీ పరిస్థితిపై చిన్న శ్రీను ఆరాతీశారు. వారి వెంట పార్టీ యువ నాయకుడు చిక్కాల లోకేష్ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన పౌరసేవలందించాలి



మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

- కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం: ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో శనివారం ఆయన పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులను పరిశీలించారు. గాంధీ పార్క్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను, పుత్సలవీధిలో పూర్తయిన బీటీరోడ్డు, హుకుంపేటలో పాక్షిక మరమ్మత్తు పనులను గమనించారు. జమ్ము ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేసిన డ్రైన్లపై ఆక్రమణలు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం సీఆర్ నగర్, ఎఫ్‌సీఐ గొడౌన్ వద్ద ఏర్పాటు చేసిన రోడ్లు డ్రైన్లను పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న ఓ వాణిజ్య భవనం సెట్ బ్యాక్స్‌లో లోటుపాట్లు ఉన్నట్టు గుర్తించి, తక్షణమే సరి చేయించాలని ఆదేశించారు. అనంతరం ఆల్తివీధిలో మంచినీటి పంపిణీ ప్రక్రియను గమనించి క్లోరిన్ పరీక్షలను నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఉన్న కమ్యూనిటీ టాయిలెట్లను పరిశీలించారు. అనంతరం డీఎస్ఆర్ పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆ తర్వాత జొన్న గుడ్డి ప్రాంతంలో రహదారిపై భవన వ్యర్థాలను గమనించి అసహనం వ్యక్తం చేశారు. వాటిని ఎవరు వేశారో గుర్తించి వారితోనే ఆ వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ధర్మపురిలో ఉన్న వసంత విహార్ విల్లాస్‌లో మంచినీటి కుళాయిల ద్వారా నీరు రావడంలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించారు. తక్షణమే అంచనాలు రూపొందించి పైప్‌లైన్లు వేసే విధంగా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ కె.శ్రీనివాసరావు, డీఈ అప్పారావు, ఏఈలు వెంకటేశ్వరరావు, బొడ్డు రవి, తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణగా దుర్గాదేవి



శాకంబరీదేవి అలంకరణలో అమ్మవారు



విజయనగరం టౌన్ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న దుర్గాదేవి



శాకంబరీమాతగా భక్తులకు దర్శనమిస్తున్న కాళికామాత

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడిలో కొలువైన దుర్గాదేవీ శనివారం అన్నపూర్ణాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు వెలువలపల్లి నరసింహాచార్యులు, సాయిలు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీచక్ర కుంకుమార్చనలలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.

గాజులరేగలో శాకంబరీదేవీగా..

విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ సాలివీధి మెయిన్‌రోడ్డులో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు దుర్గాదేవీ అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రదీప్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు.

శాకంబరీగా కాళికామాత

విజయనగరం టౌన్: స్థానిక కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన కాళికామాత శనివారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సోమశేఖరశర్మ వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. శరన్నవరాత్రులను పురస్కరించుకుని ప్రతీరోజూ ప్రత్యేక అలంకరణలు, కుంకుమార్చనలను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి తెలిపారు.